ప్రజాశక్తి

శనివారం 30 సెప్టెంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

అడకత్తెరలో అధికారులు!

- పేట ఘటనలో విఆర్‌కు ఇద్దరు సిఐలు?
- చంద్రబాబు కాన్వాయ్ అడ్డుకోవడంపై ఆగ్రహం

చంద్రబాబును అరెస్టు చేసి తీసుకెళ్తున్న సందర్భంలో చిలకలూరిపేటలో జాతీయ రహదారిపై టిడిపి శ్రేణుల ఆందోళన (ఫైల్), ఇన్‌సెట్‌లో లాఠీఛార్జీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఎన్నికల ఏడాదిలో అధికారులు క్రమంగా ఇరకాటంలో పడుతున్నారు. ఏ పాటి చిన్న తప్పిదం జరిగినా, ప్రభుత్వానికి నచ్చని పరిణామం చోటుచేసుకున్నా వెంటనే సంబంధిత అధికారులను విధుల నుంచి తప్పిస్తున్నారు. ప్రధానంగా పోలీసు శాఖలో ఈ వత్తిడి అధికంగా ఉంటోంది.

ఈనెల 8వ తేదీన చంద్రబాబును నంద్యాలలో అరెస్టు చేసి తాడేపల్లికి తరలిస్తుండగా మార్గమధ్యలో చిలకలూరిపేట వద్ద ఆయన కాన్వాయ్ ఎక్కువ సేపు నిలిచిపోవడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో జాతీయ రహదారిపైకి వచ్చి చంద్రబాబు కాన్వాయ్‌కు అడ్డుగా నిలిచారు. దీంతో పోలీసులు టిడిపి కార్యకర్తలను నిరోధించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. చివరికి పల్నాడు జిల్లా ఎస్‌పి రవిశంకర్‌రెడ్డి వచ్చి లాఠీఛార్జి చేసి కార్యకర్తలను చెదరగొట్టారు. ఈ ఘటనకు బాధ్యులుగా అభియోగం ఎదుర్కొన్న చిలకలూరిపేట అర్బన్, రూరల్ సిఐలను విఆర్‌కు పంపాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. అయితే వీరి స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

చిలకలూరిపేటలో చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకోవాలని అప్పటికే టిడిపి అగ్రనాయకత్వం నుంచి మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావుకు సందేశం వచ్చింది. ఆయన్ను 8వ తేదీ ఉదయమే పోలీసు అధికారులు గృహనిర్బంధంలో ఉంచారు. అధినాయకత్వం ఆదేశాల మేరకు పుల్లారావు తన అనుచరులను, పార్టీ కార్యకర్తలను నేరుగా జాతీయ రహదారిపైకి పంపారు. కాన్వాయ్ అడ్డుకోవాలని సూచించారు. ఇందుకోసం స్థానిక పోలీసు అధికారులతో కూడా చర్చించారని తెలిసింది. కాన్వాయ్ రాకముందే కేవలం 15 నిమిషాల పాటు జాతీయరహదారిపై నిరసన తెలియచేస్తారని చెప్పడంతో

2లో

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

3 నుండి సిపిఎం పాదయాత్ర

- మంగళగిరి నియోజకవర్గంలో 10 రోజుల పాటు ప్రజాచైతన్య యాత్ర
- ప్రారంభించనున్న కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రజా సమస్యలపై మంగళగిరి నియోజకవర్గంలో 3వ తేదీ నుంచి సిపిఎం ప్రజా చైతన్యయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. ఈ మేరకు తాడేపల్లిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాదయాత్ర ప్రారంభ సందర్భంగా 3వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభ సభ ఉంటుందన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. ఉండవల్లి సెంటర్ నుంచి యాత్ర ప్రారంభమై పది రోజుల పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు పర్యటిస్తూ మంగళగిరి మండలం నిడమర్రులో ముగుస్తుందని, 16వ తేదీన మంగళగిరి మున్సిపల్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని చెప్పారు.

ఈ ప్రాంతంలో పేదల కోసం ఉద్యమాలు నడిపి పోరాటాలు చేసి సుమారు ఆరు వేల మందికి ఇళ్లు వేయించిన చరిత్ర సిపిఎంకు ఉందన్నారు. నియోజకవర్గంలో సింహాద్రి శివారెడ్డి, భీమిరెడ్డి సాంబిరెడ్డి, మేకా అమరారెడ్డి, బండారు ముత్యాలు, మాలకొండారెడ్డి 20 వేల మందికి ఇళ్లపట్టాల కోసం కృషి చేశారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన పేదలందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. సిఎం నివాసం ఉంటున్న తాడేపల్లి పట్టణాన్ని రాబోయే రోజుల్లో

2లో

జాతాకు మంగళగిరిలో స్వాగతం పలుకుతున్నఉపాధ్యాయులు, నాయకులు

విద్య, హక్కుల కోసం ఉద్యమం

యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార జాతాలో నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు, మంగళగిరి

ప్రభుత్వం ఆధ్వర్యంలో నాణ్యమైన విద్య, ఉపాధ్యాయుల హక్కుల కోసం మరొక పెద్ద ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా చేపట్టిన స్వర్ణోత్సవ ప్రచార జాతా శుక్రవారం గుంటూరు జిల్లాలో పర్యటించింది. గుంటూరు, మంగళగిరిలో జాతాకు ఘన స్వాగతం లభించింది. గుంటూరు బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు టి.అంజిరెడ్డి యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి, చెన్నుపాటి లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పూలమాల వేశారు. అనంతరం ప్రచార జాతాను ప్రచార జాతాను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు జెండా ఊపి ప్రారంభించారు. జాతా గుంటూరు లాడ్జి సెంటర్, ఎన్టీఆర్ స్టేడియం, గుజ్జనుగుండ్ల సెంటర్ మీదుగా పాత ఆర్టిఓ ఆఫీస్ కలెక్టరేట్ దగ్గరకు చేరింది. కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ సీనియర్ నాయకులు

2లో

అందరికీ అన్నం కోసం కృషి చేసిన స్వామినాథన్

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

హరితవిప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతికి రైతు సంఘాలు, కార్మిక సంఘాలు సంతాపం తెలిపాయి .శుక్రవారం బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ అధ్యక్షతన జరిగిన సభలో రిటైర్డ్ సైంటిస్ట్, జెవివి రాష్ట్ర మాజీ అధ్యక్షులు, రైతు రక్షణ వేదిక వ్యవస్థాపకులు ప్రొఫెసర్ ఎన్..వేణుగోపాలరావు మాట్లాడుతూ అందరికీ మూడు పూటలా తిండి పెడుతున్న రైతుల కడుపు నింపాలని, వారి కుటుంబాల్లో సిరులు పండాలని, యావత్తు ప్రజానీకానికి ఆహారాన్ని అందించాలని స్వామినాథన్ ఎంతో కృషి చేశారన్నారు. బ్రిటిష్‌వారి అరాచకాలు, అకృత్యాలు ఆయన మనసుని కదిలించాయని, కానీ ఆయన ఆయుధాలు పట్టకుండానే ఆయన ఆలోచనలతో దేశంలో ఆహార కొరతను ఎదుర్కోవడానికి మేలైన వరి, గోధుమ, మొక్కజొన్న వంగడాల రూపకల్పంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. దేశ ప్రజలకు

గుంటూరు సభలో మాట్లాడుతున్న సూరయ్య చౌదరి

ఆహారాన్ని అందించడమే కాకుండా విదేశాలకు కూడా ఎగుమతి చేసే స్థాయికి తీసుకొచ్చిన డాక్టర్ స్వామినాథన్ మరువలేని మహనీయుడు అన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ మాజీ డైరెక్టర్ బండ్ల సూరయ్య చౌదరి మాట్లాడుతూ రైతులకు సంబంధించి ఆయన అనేక సిఫార్సులు కేంద్రానికి అందించారని, కానీ ఆయా సిఫారసుల అమలులో పాలకులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు కె.రాజశేఖర్‌రెడ్డి, పి.శివాజీ, వై.నేతాజీ, వి.నరసింహారావు, కె.కోటయ్య, యు.నాగేశ్వరరావు, ఎం.శివయ్య, బి.శ్రీనివాసరావు, ఎ.అరుణ్ కుమార్, కె.నళినీకాంత్, బి.ముత్యాలరావు, కె.విఠల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మండలంలోని పొనుగుపాడులో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సభ నిర్వహించగా మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ పాతూరి సీతారామాంజనేయులు మాట్లాడుతూ రైతులపై జాతీయ కమిషన్ అధ్యక్షులుగా కనీస

2లో

సదస్సులో పాల్గొన్న కెఎస్ సాయిబాబ, దీపక్ వైకర్ తదితరులు

వివిఐటీలో 'చౌకగా సుస్థిర శక్తివనరులు' సదస్సు

ప్రజాశక్తి-తెనాలి : వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల నంబూరులో శుక్రవారం 'చౌకగా సుస్థిర శక్తి వనరులు' అంశంపై సదస్సు నిర్వహించారు. కళాశాల ఐఈఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ముఖ్యవక్తలుగా మాజీ ఐఎఫ్ఎస్ అధికారి కెఎస్ సాయిబాబ, ఐఈఈ శాక్ సంధానకర్త తారా సాయికుమార్, ఆన్‌లైన్‌లో సింగపూర్‌కు చెందిన ఐఈఈ ఎడ్యుకేషన్ పొసైటీ చైర్మన్ దీపక్ వైకర్ పాల్గొన్నారు. కెఎస్ సాయిబాబ మాట్లాడుతూ స్థిరమైన శక్తికి పునరుత్పాదక విద్యుత్ అవసరం ఎక్కువగా ఉందని, వాటిలో సౌరశక్తి ఎంతో కీలకమైందన్నారు. దేశంలో జల, సౌర, పవనశక్తి వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. 2050 నాటికి భూమిపై కర్బన్ ఉద్గారాలను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అణుశక్తి వినియోగం పెరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 12 కళాశాలలకు చెందిన 450 మంది విద్యార్థులు, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, ఐఈఈఈ గుంటూరు శాఖ సభ్యులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ స్వర్ణశ్రీ, ప్రోగ్రాం సంధానకర్త ఎంఆర్ఎన్ ఠాగూర్ పాల్గొన్నారు.

తహశీల్దార్ చొరవతో రైతు సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - చేబ్రోలు : మండలంలోని సుద్ధపల్లికి చెందిన శెట్టిపల్లి వెంకటరావు తన పొలం సమస్య పరిష్కారం అధికారులకు ఫిర్యాదు చేశారు. తనకున్న ఎకరం పొలంలో నుండి వర్షపు నీరు బయటకు పెట్టుకోవడానికి వీల్లేకుండా ఇతరులు ఇబ్బంది పెడుతున్నారని, మూడేళ్లుగా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. దీనిపై తహసీల్దార్ కెవి గోపాలకృష్ణ శుక్రవారం రైతు వెంకట్రావు పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. చుట్టుపక్కల రైతులను పిలిపించి మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

పొన్నూరి భరత్‌కు పి హెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున యూనవర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన చేసినందుకుగాను పొన్నూరి భరత్‌కు పిహెచ్‌డి ప్రదానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. రీసెర్చ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ డి.రామచంద్రన్ వ్యవహరించారు. భరత్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

లింగ వివక్ష లేని సమాజం కోసం కషి చేద్దాం

ప్రజాశక్తి - తుళ్లూరు : లింగ వివక్ష లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంగళగిరి గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ కో-ఆర్డినేటర్ అనూష కోరారు. పెదపరిమిలోని మిక్చర్ కాలనీలో గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్ అధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళల పట్ల వివక్షను రూపు మాపాలని, వారి హక్కుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మండల కమ్యూనిటీ ఫెసిలిటేటర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే బాల, బాలికలను సమానంగా చూడాలని కోరారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఎంఇఒ-2 లీలారాణి అన్నారు. నాయకత్వ లక్షణాలు, లింగ సమానత్వంపై మండల పరిషత్ కార్యాలయంలో మానవ హక్కుల క్లబ్, పారా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఎంఇఒ మాట్లాడుతూ సమస్యలెదురైతే ధైర్యంగా ఎదుర్కోవాలని చెప్పారు. పారా సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ ఎం.ఆనంద్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, అక్రమ రవాణా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో టి.మంగయ్య, వెంకటేశ్వరరావు, జోష్, సలాం పాల్గొన్నారు.

నేడు మహానాడులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి మహానాడులో 11 కెవి ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇ సత్యనారాయణ, ఎఇ కె.నాగమల్లేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహానాడు కట్ట నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజ్వలించే నిప్పు కణిక భగత్‌సింగ్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ప్రజ్వలించే నిప్పు కణిక భగత్‌సింగ్ అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ప్రొపెసర్ పి.రాజశేఖర్ అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా వర్సిటీలోని విగ్రహానికి వీసీ శుక్రవారం పూలమాలలేసి నివాలులర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో భగత్‌సింగ్ పాత్రను గుర్తు చేశారు. భగత్‌సింగ్ స్ఫూర్తిని విద్యార్థులు అవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రెక్టార్ పి.వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, విశ్వ విద్యాలయ అధ్యాపక సంఘం అధ్యక్షులు బి.నాగరాజు, ప్రిన్సిపాళ్లు సిహెచ్ స్వరూపరాణి, పి.సిద్దయ్య, జాన్సన్, ఇ.శ్రీనివాసరెడ్డి, కె.సునీత, ఇంజినీర్ కుమార్‌రాజా పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

భగత్‌సింగ్ త్యాగనిరతి నేటి యువతకు ఆదర్శమని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు చెప్పారు. భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా ప్రకాష్‌నగర్‌లో సభ నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అతి పిన్న వయసులో దేశం కోసం చిరునవ్వుతో ఉరికంభం ఎక్కిన భగత్‌సింగ్ త్యాగం నిరుపమానమైనదని కొనియాడారు. ప్రస్తుతం దేశం విష పరిస్థితుల్లో ఉన్న నేటి తరుణంలో భగత్‌సింగ్ లాంటి యువకులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.దుర్గారావు, స్టాలిన్ పాల్గొన్నారు.

విద్య, హక్కుల కోసం ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

వి.విశ్వనాథం జెండా ఆవిష్కరించారు. యుటిఎఫ్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి యుటిఎఫ్ కార్యకర్త ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించే బాధ్యతను తీసుకోవాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కె.జోజయ్య మాట్లాడుతూ చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి, రామిరెడ్డి త్యాగధనులు స్థాపించినటువంటి సంఘంలో ఈరోజు మనందరం సభ్యులుగా ఉండటం ప్రతీ కార్యకర్త గర్వించదగ్గ విషయం అన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ యుటిఎఫ్ లక్ష్యాలు అని, ఉపాధ్యాయులు వాటిని తూచా తప్పక పాటించాలని సూచించారు. మంగళగిరికి చేరిన జాతాకు స్థానిక వడ్లపూడి సెంటర్లో ఘన స్వాగతం లభించింది. అనంతరం బైక్ ర్యాలీలో మిద్దె సెంటర్ మీదుగా గౌతమ్ బుద్ధ రోడ్డు, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ సెంటర్ మీదగా నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అనంతరం జెండాను సీనియర్ నాయకులు డి.మాలకొండయ్య ఆవిష్కరించారు. కార్యక్రమానికి టి.ఆంజనేయులు అధ్యక్షత వహించగా రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎస్ఎన్ కుసుమకుమారి మాట్లాడారు. జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేసే వరకూ పోరాడతామని చెప్పారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక సంపాదకులు కె.కుమార్‌రాజా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం యుటిఎఫ్ పోరాడుతుందన్నారు. అనంతరం నిమ్మగడ్డ రామ్మోహన్ రావు విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి ఎం.కళాధర్, రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు, నాయకులు కెఎస్‌వి దుర్గారావు, ఎన్.తాండవకృష్ణ. సి.ఎచ్ వీరబ్రహ్మాం, ఎ.శ్రీనివాసరావు, బసవేశ్వరరావు, యు.రాజశేఖర్, శివపార్వతి, జి.వెంకటేశ్వరరావు, ఎం.కోటిరెడ్డి, సైదా నాయక్, ఎస్.కె రెహమాన్, సిహెచ్.శివనాగేశ్వరావు, సుబ్బారావు, ఆదినారాయణ, రాధాకృష్ణ, సిఐటియు నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ, ఎయిమ్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె.బుచ్చిబాబు, జి.శ్రీనివాసరావు, శంకర్ పాల్గొన్నారు.

కోర్టులను పరిశుభ్రంగా ఉంచుదాం

ప్రజాశక్తి-మంగళగిరి, సత్తెనపల్లి

కోర్టుల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా, సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి.నాగవెంకటలక్ష్మి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కోర్టు ప్రాంగణాల్లో స్వచ్ఛభారత్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యతన్నారు. కోర్టుల పరిధిలో ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు వదలడం, వాటర్ బాటిల్స్ పడవేయడం సరికాదన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కోర్టుల ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తామని న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, మున్సిపల్ శానిటరీ సిబ్బంది పాల్గొనాలని కోరారు. అనంతరం మంగళగిరని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్‌వి రామకృష్ణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.ప్రత్యూష, సత్తెనపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె.ప్రశాంతి మాట్లాడారు. కోర్టుల ప్రాంగణంలో ఉమ్మివేసినా, వ్యర్థాలు వేసినా జరిమానా విధిస్తామన్నారు.



గుంటూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖర్, తదితరులు, పొనుగుపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు

అందరికీ అన్నం కోసం కృషి చేసిన స్వామినాథన్

(మొదటి పేజీ తరువాయి)

మద్దతు ధరను అందించాలని సిఫార్సు చేశారని చెప్పారు. పంటలకు ధరల్లేక రైతులు నష్టాలు పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇవి ఆగాలంటే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వాలు అమలు చేయాలని అన్నారు. ఆయనకు భారతరత్న బిరుదును ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు, డి.రామారావు, కె.శ్రీనివాస్, టి.వెంకయ్య, జి.వెంకటేశ్వరరావు, వై.కృష్ణ, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక వైసిపి ప్రాంతీయ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడారు. మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైసిపి నాయకులు నూరిఫాతిమా, ఎం.రాధా, ఎం.శ్రీనివాసరెడ్డి, ఘనీక ఝాన్సీ పాల్గొన్నారు.

నేడు ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ సభ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ సభ వడ్డేశ్వరంలోని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయం (కెబి భవన్)లో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సభకు రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రిశ్వరరావు, రైతు సంఘం నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

అడకత్తెరలో అధికారులు!

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు అధికారులు కూడా పట్టుసడలించారు. జాతీయ రహదారిపైకి నిరసన తీవ్ర రూపందాల్చి వేలాది మంది రావడంతో కాన్వాయ్‌కు అడ్డుతగిలారు. దీంతో వీరిని నియంత్రించడం పోలీసులకు కష్టతరమైంది. ఈలోగా ఎస్‌పి వచ్చి లాఠీఛార్జి చేసి కాన్వాయ్‌ను ముందుకు పంపారు. తిమ్మాపురం వద్ద కూడా దాదాపు 20 నిమిషాలపాటు కాన్వాయ్ నిలిచిపోయింది. ఈ ఘటనకు బాధ్యులుగా పట్టణ సిఐ రాజేశ్వరరావు, రూరల్ సిఐ అచ్చయ్యను విఆర్‌కు పంపాలని నిర్ణయించారు.

రాజేశ్వరరావు రెండేళ్లుగా చిలకలూరిపేటలో పనిచేస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే పలువురు సిఐలు విఆర్‌లో ఉన్నారు. స్థానికంగా ఎమ్మెల్యేలకు, మంత్రులకు అనుకూలంగా పనిచేస్తున్నా ఎదో ఒక ఘటనలో ప్రత్యర్థులకు సహకరించారనో, వారికి అనుకూలంగా వ్యవహరించారన్న అంశాలపై కూడా బదిలీ వేటుకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు కూడా పోలీసు ఆంక్షలు చేధించుకుని నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసులు సంయమనంతో వ్యవహరించి ఘర్షణలను నిరోధించినా కొన్ని సందర్భాల్లో మాత్రం ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోంది. ఇటీవల టిడిపి నాయకులు విద్యానగర్‌లో భారీ ర్యాలి నిర్వహించగా అనుమతి లేదని సాయిబాబారోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేయగా వీటిని తోసుకుంటూ కార్యకర్తలు ముందుకు దూసుకువెళ్లారు. వీరిని నియంత్రించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. జనసేన నాయకులు ఇటీవల చలోఅసెంబ్లీకి పిలుపు ఇవ్వగా పార్టీ జిల్లా నాయకులను చాలా వరకు గృహ నిర్బంధంలో ఉంచినా జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మందడం వరకు వచ్చి నిరసనకు దిగడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయినట్టు తెలిసింది.

3 నుండి సిపిఎం పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

డ్రెయినేజీ ముంచెత్తనుందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణానది పక్కనే ఉన్నా తాగునీటి సమస్య కొన్ని ప్రాంతాల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన పట్టణ జనాభాకు అనుగుణంగా రెండు పూటలా తాగునీరు సరఫరా చేయాలని కోరారు. తాడేపల్లిలో కొండ చుట్టూ ఇళ్లు వేసుకుని ఉంటున్న పేదలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా పేదలు సాగు చేసుకుంటున్న లంక భూములకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా పట్టాలు ఇవ్వాలన్నారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌తో పాటు రాజధాని అమరావతిలో పారిశుధ్య కార్మికులకు పని భారం పెరిగిందని, పనికి తగ్గట్లు పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. నెలనెలా పారిశుధ్య కార్మికులు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు పి.బాలకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, ఎం.రవి, ఎస్ఎస్ చెంగయ్య, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు కె.కరుణాకరరావు, వి.దుర్గారావు, ఎస్.ముత్యాలరావు, వై.బర్నబస్, పి.కృష్ణ పాల్గొన్నారు.

పలు చోరీ కేసుల్లో నిందితులు అరెస్టు

బంగారం, నగదు స్వాధీనం

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలోని 5 పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన 7 దొంగతనం కేసులను చేదించి,నిందితులను అరెస్ట్ చేసినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నిందితుల వద్ద నుండి 363.95 గ్రాములు బంగారం, రూ 3.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగతనానికి ఉపయోగించిన మారుతీ షిఫ్ట్ డిజైర్ కారు సీజ్ చేసినట్లు చెప్పారుమండల కేంద్రం నకరికల్లు ఇందిరమ్మ కాలనీకి చెందిన ముగ్గురు యువకులు ఎక్కులూరి సురేష్, రుద్రాల సురేష్, మహంకాళి గణేష్ లు చెడు వ్యవసనాలకు బానిసలై ముఠాగా ఏర్పడి తాళాలు వేసిన ఇళ్లపై రెక్కీ నిర్వహించి జనం ఎవరూ లేరని నిర్ధారించుకొని ఇళ్లలో చోరీకి పాల్పడుతున్నారని చెప్పారు. రుద్రాల సురేష్ పై 14 కేసులు, మహంకాళి గణేష్ పై 3 కేసులు ఉన్నాయని గతంలో జైలు శిక్ష అనుభవించారన్నారు. ఇంటి తాళంను పగలగొట్టి ఆ ఇంటి లోనికి వెళ్లి స్క్రూ డ్రైవర్ తో బీరువాలు తెరిచి చోరీకి లకు పాల్పడుతారన్నారు. సత్తెనపల్లి రూరల్ సి.ఐ కి అందిన సమాచారం మేరకు నేడు కారంపూడి క్రాస్ రోడ్డు వద్ద

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి

వాహనాల తనిఖీ చేస్తుండగా నిందితులు ముగ్గురు కారులో కారెంపూడి నుండి నకరికల్లు వైపు వస్తున్న క్రమంలో పోలీసులు వాహన తనిఖీలు చేయడం చూసి కారును వెనకు తిప్పుకొని పారిపోవుతుండగా పట్టు కున్నట్టు చెప్పారు. ముగ్గురు యువకులను విడివిడిగా విచారించగా చేసిన 7 నేరములను ఒప్పుకున్నారని,వారి వద్ద నుండి 363.95 గ్రాముల బంగారు ఆభరణాలను రూ.3.50 లక్షల నగదును రికవరీ చేశారన్నారు. తక్కువ సమయంలో ముద్దాయిలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సత్తెనపల్లి డిఎస్పీ బి.ఆదినారాయణ, సత్తెనపల్లి రూరల్ సి.ఐ పి. ప్రేమయ్య, నకరికల్లు ఎస్.ఐ ఏ. బాలకష్ణ, ఏ.ఎస్.ఐ బి.ప్రసాదరావు, హెడ్ కానిస్టేబుళు శ్రీధర్, కె.సుందరరావు, కానిస్టేబుళ్ళు సుభాని, పార్థసారథి, డి.చెన్నకేశవులు, కె.జ్ఞానయ్య, ఎం. అశోక్, పి.సురేష్ బాబు, ఎం.గౌరి నాయుడు, హోం గార్డు షేక్ షరీఫ్‌లను ఎస్పీ అభినందించారు.

పట్టుబడిన నిందితులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నేరం

ప్రజాశక్తి-తెనాలి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిపై చట్ట పరమైన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంక టేశ్వర్లు హెచ్చరించారు. రూరల్ గ్రామం నందివెలుగు కూడలి, కొలకలూరు ఫ్లైఓవర్ దిగువ బహిరంగంగా మద్యం సేవిస్తున్న రెండు బృందాలను రూరల్ ఎస్ఐ నేతృ త్వంలోని పోలీసు బృందం గుర్తించింది. వారికి ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు.

2న జంతు వధ నిషేదం

ప్రజాశక్తి-తెనాలి: అక్టోబర్ రెండున గాంధీ జయంతి సందర్భంగా జంతు వధ నిషేదమని మున్సిపల్ కమిషనర్ ఎం. జస్వంతరావు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కబేళా మూసివేయాలని, మాంసం, చేపల విక్రయదారులు కూడా దుకాణాలు మూసి వేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు/పల్నాడు జిల్లాల విలేకరులు

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా తెనాలి రూరల్ గ్రామం అంగలకుదురులో మహిళలు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో టిడిపి చేపట్టిన నిరసన దీక్ష శిబిరంలో శుక్రవారం మహిళలు మెడకు ఉరితాళ్ళతో నిరసన తెలిపారు. దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సందర్శించారు. తుళ్లూరులో నల్ల జెండాలు చేత బట్టి సిఎం జగన్ మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొల్లిపర మండలంలోని దావులూరులో 'బాబు కోసం నేను' కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేశారు. మంగళగిరిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 16వ రోజుకు చేరాయి. దీక్ష శిబిరాన్ని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్ రావు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు ఎన్ బాలాజీ తదితరులు సందర్శించి మద్దతు తెలిపారు. చిలకలూరిపేటలో టిడిపి రిలే నిరాహార దీక్షలు 17వ రోజు కొనసాగాయి. మాజీమంత్రి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.పుల్లారావు మాట్లాడారు. అమరావతిలోని టిడిపి చేపట్టి ఐదవ రోజు మహిళల దీక్షలో మాజీ ఎమ్మెల్యే కొమ్మాల పాటి శ్రీధర్ పాల్గొన్నారు. పెదకూరపాడు మండలంలోని పొడపాడులో నిర్వహించిన కార్య క్రమంలో పల్నాడు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

జోరుగా బైక్ రేసులు!

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని ప్రధాన రహదారుల్లో యువకులు బైక్ రేసింగ్‌లు జోరుగా నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంతో యువకులు స్నేక్ డ్రైవింగ్‌లు చేస్తూ వాహనదారులను, పాదాచారులను బెంబెలెత్తిస్తున్నారు. ప్రధానంగా మథర్ థెరిస్సా విగ్రహం నుంచి బృందావన్ గార్డెన్స్ వరకు, గుజ్జనగుండ్ల నుంచి ఎల్‌విఆర్ క్లబ్ వరకు బైక్ రేసులు భారీగా జరుగుతున్నాయి. కొన్ని సమయాల్లో విద్యానగర్ నుండి గుజ్జనగుండ్ల వరకు కూడా యువత రేసింగ్ చేస్తూ రోడ్డుమీద వాహన చోదకులను, పాదాచారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నెంబర్ ప్లేట్ లేకుండా రేసులు నిర్వహిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే లక్ష్మీపురం, విద్యానగర్ ప్రాంతాల్లో జరుగుతున్న ఈ రేసింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో అకతాయిలు ఇలా చేసేవారు. ఇటీవల ఒక మాఫియా ఎదేదాలు కాస్తూ యువకులకు పందేలు నిర్వ హిస్తున్నారు. ప్రధానంగా సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల లోపు ట్రాఫిక్‌లో నిర్ధేశితగమ్యస్థానంకు వెళ్లేలా పందేలు కాయిస్తున్నారు. అలాగే నగరంలో అన్ని మార్గాల్లో రాంగ్ రూట్ డ్రైవింగ్ యథేశ్చగా సాగుతోంది. ట్రాఫిక నిబంధనలు పట్టించుకోవడం లేదు. జంక్షన్ పాయింట్లలో డివైడర్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసులు విధుల నుంచి దూరం అవుతున్నారు. గతంలో జంక్షన్ పాయింట్లలో కానిస్టేబుల్స్ ఉండేవారు. ఇప్పుడు జంక్షన్ దాటి ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకునేలా చేస్తున్నారు.దీని వల్ల రాంగ్ రూట్ డ్రైవింగ్ బాగా పెరుగు తోంది. బస్టాపుల వద్ద బస్సుల కోసం వేచి ఉండే వారిని ఢీ కొడుతూ రాంగ్ రూట్‌లో వాహనదారులు దూసుకువెళ్తున్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
ఐ.పి. 60/2023

పిటీషనరు - ముంద్రు రాములమ్మ

అండ్

రెస్పాండెంట్లు - 1. కనాల గురవారెడ్డి

2. పెరుమాళ్ళ అమరనాథ్

పై నెంబరులో పిటీషనరు, యిందలి రెస్పాండెంట్లు అయిన క్రెడిటార్ ఐ.పి. దాఖలు చేసి ఇందలి పిటీషనరుకు 1వ రెసొపడెంటు ఇవ్వవలసిన బాకీ డబ్బు గాక ఇంకా ఇతరులకు ఎవరికైనా 1వ రెస్పాండెంటు డబ్బు బాకీ వున్న యెడల పై కోర్టువారి యెదుట ది. 3-10-2023వ తేదీ ఉదయం 10-30 గం.లకు మీరు హాజరు కాబడి మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షమందు తీర్మానించబడును.

ఎ.అజయబాబు,
పిటీషనరు తరపు అడ్వకేటు,
వినుకొండ.

NAME CHANGE

I,Bandla Srilakshmi W/o Pattaiah R/o D.No. 6-220, Nidumukkala Village, Tadikonda Mandal, Guntur dt. A.P India - 522016. have changed my name from BANDLA SRI LAKSHMI to BANDLA LAKSHMI an vide affidavit dated 28-09-2023 before Notary.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 23,996
మిర్చి ఎగుమతి	: 25,459
మిర్చి నిల్వ	: 9,554

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,500 - 23,000
నెం.5	10,500 - 23,000
273	16,000 - 19,200
341	10,000 - 22,500
నాన్ ఏసి	
తేజ	9,500 - 24,000
బడిగి	10,000 - 26,000
దేవనూరు డీలక్స్	14,000 - 18,500
తాలుకాయలు	5,000 -14,500
ఏసి	
334	14,000 - 22,800
273	19,000 - 19,000
341	15,000 - 22,000
4884	15,000 - 21,800
తేజ	10,500 - 24,000
బడిగి	16,000 - 25,000
దేవనూరు డీలక్స్	17,500 - 19,000
తాలుకాయలు	7,000 -13,500

రేడియాలజీ విభాగం విస్తరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసువత్రి రేడియాలజీ విభాగాన్ని తాత్కాలికంగా 20 పడకల వార్డుగా మార్చనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం రేడియాలజీ విభాగాన్ని ఆయన పరిశీలించారు. ఈ విభాగం 14 గదుల్లో వివిధ రకాల వస్తువులు పరికరాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆయన చెప్పారు. జనరల్ మెడిసిన్ రోగుల రద్దీ ని దష్టిలో పెట్టుకుని సత్వర అవ సరాల కోసం 20 పడకల వార్డు ను తాత్కా లికంగా అందుబాటులో తీసుకుని వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఆయన చెప్పారు. సాధారణ వైద్యం కోసం వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోందని దాని వల్ల అనేక వార్డు లో రోగులు ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆయన చెప్పారు. రోగుల రద్దీ దష్టిలో పెట్టుకుని రేడియాలాజి విభాగాన్ని జనరల్ మెడిసిన్ వార్డుగా మారుస్తామని ఆయన తెలిపారు.

రూ.7 కోట్లతో సర్వీస్ బ్లాక్ నిర్మాణం

అసంపూర్తిగా నిలిచిన సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడు కోట్లు మంజూరు చేసిందని డాక్టర్ కిరణ్ కుమార్ వెల్లడించారు. త్వరలో టెండర్లు పిలవడం జరుగుతుంది. పనులు కూడా వెంటనే ప్రారంభించేందుకు ప్రణాళిక లను సిద్ధం చేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ సర్వీస్ బ్లాక్ లోకి రేడియాలజీ విభాగాన్ని పూర్తిగా తరలిస్తామని ఆయన అన్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 382/2021

బిట్వీన్ :

షేక్ దావూద్ .... వాది

వర్సెస్

పూసపాటి శివాంజనేయ నాగరాజు.... ప్రతివాది

పూసపాటి శివాంజనేయ నాగరాజు, తండ్రి: రత్నాచారి, పంచాయతీ సెక్రటరీ, పంచాయతీ ఆఫీస్, అమరావతి గ్రామము, మండలం, గుంటూరుజిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు వాజ్యంలో వాది మీపై ఇందలి దావాను దాఖలు చేయగా శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా ఇందలి ప్రతివాది అయిన మీకు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై తెలిపిన శ్రీ కోర్టువారు ఇందలి ప్రతివాదికి ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసును ఆర్డరు వేసియున్నారు. కావున ప్రతివాది హాజరు నిమిత్తం ది. 11-10-2023న వాయిదా వేసియున్నారు. ఆ రోజున మీరు గానీ మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గం.లకు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుటకు ఈ యొక్క ప్రకటన/ నోటీసు ద్వారా తెలియజేయు నిమిత్తం ఇందుమూలముగా తెలియజేయటమైనది.

వాయిదా : ది.11-10-2023

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ఈ ప్రకటన వేయడమైనది.

జి.వి.ఎస్.ప్రసాద్,
ఎన్.వి.నాగరాజు,
న్యాయవాదులు,
అరండల్‌పేట, నరసరావుపేట.

మహారాజ శ్రీ కర్నూలు ఆరవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం..150/2022
ఇన్
ఓ.యస్.నెం.111/2016

ఆల్వకొండ బేబీ సరోజిని. ...అర్జీదారు/వాది

-ఎదురి-

ఆత్మకూరి.వెంకట సుబ్బారావు
పోతివారసులు,ఆత్మకూరి సరస్వతి వగైరా
...రెస్పాండెంట్లు ప్రతివాదులు

11.వ రెస్పాండెంటుకు ఆర్డర్ 22 రూలు 4 సి.పి.సి మరియు రూలు28 సివిల్ రూల్స్ ప్రకారం నోటీసులు

ఆత్మకూరి.శ్రీవాణి
తండ్రి లేటు ఆత్మకూరి వెంకట సుబ్బారావు,
కేరాఫ్ దక్షిణామూర్తి, బ్రాహ్మణవీధి,
జిల్లా పరిషత్ ఎదురుగా,
కటేవరం, తెనాలి, గుంటూరు జిల్లా

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అత్మకూరి.వెంకట సుబ్బారావు మరియు 2వ ప్రతివాది అయిన ఆత్మకూరి మధుసుధన ప్రసాద్ చనిపోయినందున వీరకి వారసులను చేర్చమని అర్జీదారు/వాది పై అర్జీదాఖలు చేసినది. ఇందులో 11.వ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 30-10-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని పైకోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 30-10-2023

సి.వి.రాంప్రసాద్,
కె.విజయలక్ష్మి,
వాది/అర్జీదారుపరం అడ్వకేట్లు,
కర్నూలు.

IN THE COURT OF THE HON'BLE XIII ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE, VIJAYAWADA
I.A. No. 774/2019 in O.S. No. 202/2012

Between :

Alapati Jagannadham ... Petitioner /Plaintiff

And

Yanamandra Manikya Mala and others
... Respondents / Defendants

To,
The Respondents 3 to 6

R3 : Miriyala Vijaya Bhanu, W/o Surinaidu @ Suryanarayana, Agricultural Labour, R/o D.No. 12-80/C, Sundaraiah Nagar, Tadepalli, Tadepalli Mandal, Guntur District - 522 501.

R4 : Marrapu Samba Siva Rao, S/o Simhachalam, R/o D.No. 74-12-2/9D, Patamata, Vijayawada-10. Krishna District.

R5 : Lanka Durga Prasad, S/o Tata Naidu, Business, R/o D.No. 62-7-13, Old Ramalayam Street, Patamata Lanka, Vijayawada-10.

R6 : Pallem Tirumal Rao, S/o Manikyala Rao, R/o D.No. 14-118, Manikya Nagar, Kanuru Village, Penamaluru Mandal, Krishna District.

పై నెంబరు పిటీషన్‌లోని రెస్పాండెంట్స్ 3 to 6 కు శ్రీ కోర్టువారు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా వాది యొక్క నోటీసు తీసుకొను నిమిత్తం ఉత్తర్వులు జారీచేసి యున్నారు. కావున సదరు రెస్పాండెంట్స్ 3 to 6 ది. 20-10-2023వ తేదీ ఉదయం 10-30 గం.లకు పై చెప్పిన కోర్టులో స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో తెలియపరచడమైనది.

By Order of the Court.

Vijayawada
Date : 30-9-2023

Sri M.Sambasiva Rao,
Smt. M.V.L. Gopi Ratnam,
Sri M.Koti Nagaiah,
Advocates,
D.No. 27-30-7, Akulavari Street,
Governorpet, Vijayawada-2.
Cell : 9949092920

పేదల ఆరోగ్య భద్రతే లక్ష్యం

- ఏరియా వైద్యశాలలో 'స్టెమి'ప్రారంభం
- కార్పొరేటుకు దీటుగా చిన్నారుల వార్డు
- అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తే గతానికి ఇప్పటికి పూర్తిస్థాయి వ్యత్యాసం ఉందని, కార్పొరేట్ కు దీటుగా చిన్న పిల్లల వార్డును ఏర్పాటు చేశామని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం ఏరియా వైద్యశాలలో గుండె వ్యాధుల అకాల మరణాల నివారణకు స్టెమి కార్యక్రమం, చిన్నారుల వైద్య విభాగ ప్రత్యేక అవార్డు, విశ్రాంతి గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవి ష్కరించారు. మంత్రి మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి భద్రత నిచ్చేలా గుండె జబ్బుల మరణాలను నివృత్తి చేసేలా ప్రభుత్వ వైద్యశాలలో రూ.40 వేల విలువైన ఇంజక్షన్లు ఉచితంగా అందించే ఈ కార్యక్రమం పేద వర్గాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రాణా పాయం నుంచి తప్పిస్తుందన్నారు.

అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి హాస్పిటల్ అభివద్ధి కమిటీ ఎంతో సేవాభావంతో పనిచేస్తోందని అన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా చిన్న పిల్లల వార్డు హాస్పిటల్ అబివృద్ధి కమిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆధునీకరించారని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరి ఆరోగ్య భద్రతే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని మంత్రి అన్నారు. పాత్రికేయుల సమావేశంలో దీని గురించి వివరించారు. ప్రతి గ్రామం లోనూ వైద్య నిపుణులతో ప్రభుత్వమే నేరుగా వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ తులసి సాంబశివరావు, అచ్యుత శివప్రసాద్, హాస్పిటల్స్ సూపరింటెండెంట్ లక్ష్మణరావు, అర్ ఎం ఓ శోభారాణి, నర్సింగ్ సూపర్డెంట్ రాధ, హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త రామకష్ణ, డాక్టర్ రాజమోహన్ రెడ్డి, డాక్టర్ గిరిజ, వార్డు కౌన్సిలర్స్, స్టాఫ్ నర్సులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్యగదులను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు వివేకానంద స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి -కారంపూడి

సెప్టెంబర్ 9 వ తేదీన నెల్లూరు జిల్లాలో జరిగిన షూటింగ్ బాల్ సీనియర్ విభాగం, మెయిన్ విభాగం నందు కారంపూడికి చెందిన శ్రీ వివేకానంద స్కూల్ విద్యార్థులు కె. ఉదయ్ కిరణ్ (9వ తరగతి), ఎం. అరవింద్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని స్కూల్ ప్రిన్సి పాల్ సిహెచ్.విశాలాక్షి, స్కూల్ డైరెక్టర్ సిహెచ్. నాగేశ్వరరావు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలు అక్టోబర్ 14,15 తేదీలలో న్యూఢిల్లీలో జరుగుతాయని, ఈ పోటీలకు మన రాష్ట్రం నుండి పట్టణంలోని వివేకానంద స్కూల్ నుంచి ఈ ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిఇటి ప్రవీణ్, ఇంచార్జ్ సామెల్, ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందిస్తున్న సుబ్బరాయ గుప్తా, విజయ్ కుమార్ తదితరులు

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు 'ఎస్ఎస్ఎన్' విద్యార్థులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

తమ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 16 , 17 వ తేదీలలో రేపల్లె బోధిధర్మ తైక్వాండో అకాడమీ లో జరిగిన 3వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్స్ అండ్ సీనియర్స్ టైక్వాండో ఛాంపియన్ షిప్ లో అండర్-46 కేజీల విభాగంలో ఎస్ ఎస్ ఎన్ కళాశాల విద్యార్థిని ఎం ఎం అంజలి, సాయి లక్ష్మి ప్రతిభ చాటి బంగారు పతకం , మొదటి ఏడాది నర్సింగ్ విద్యార్థిని వి. తులసి తన్మయి 52- కేజీల కేటగిరిలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్ , కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ నాగ సరపు సుబ్బరాయ గుప్తా, పాలకవర్గ సభ్యులు ఇం టెన్సీ క్యాంపస్ ఇన్ఛార్జి డాక్టర్ ఎమ్.ఎస్ సుధీర్, నర్సింగ్ కోర్స్ ఇన్ఛార్జి ఎబిఎన్ గుప్తా, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ యక్కల మధుసూదనరావు, అభినందించారు.జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటి కళాశాలకు తల్లిదండ్రులకు పల్నాడు జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు విజయ్ కుమార్, సుబ్బరాయ గుప్తాలు పేర్కొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

ప్రజాశక్తి-ఈపూరు

విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేసే ఉపా ధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుం దని ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని బొగ్గరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు పొందిన సిహెచ్ వీరప్పయ్య అభినందన సభ శుక్రవార జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యా ర్థులను చైతన్య పరచడంలో వీరప్పయ్యది ప్రత్యేక స్థానం అని అన్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా మంచి పుస్త కాలు రచించడంతోపాటు ఎస్ఇఆర్టిలో పని చేశారని నిరం తరం విద్యార్థుల బాగు కోసం పనిచేసే గొప్ప వ్యక్తి వీర ప్పయ్య అన్నారు. బొగ్గరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివద్ధికి కృషి చేశారన్నారు. జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలలో విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉండేలా తీర్చిదిద్దా రన్నారు. కరోనా తర్వాత విద్యార్థులలో అనేక మార్పులు వచ్చాయని వాటికి అనుగుణంగా ఉపాధ్యాయులు మరింత కష్టపడాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాల కోసం అదనంగా పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నారని వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలు ఉంటారని వారి విద్యా భివృద్ధికి అహర్నిశలు శ్రమించాలన్నారు. సాంకేతికతను ఆహ్వానించాలని విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేయడం మంచిదే అయినప్పటికీ, అందులో బైజుస్ కంటెంట్ ఉంచడం మంచిదికాదని అభిప్రాయపడ్డారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాకూడదని యునెస్కో వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న పూర్వ విద్యార్థులను సభలో వక్తలు కొని యాడారు. అనంతరం లక్ష్మణరావు, ఉపాధ్యాయులతో కలిసి వీరప్పయ్య దంపతులను సన్మానించారు.

కార్యక్రమంలో ఎంఇఒలు కె బాబురెడ్డి, రామ తులసి,ఎస్సిఆర్టి సభ్యులు గౌస్ బాషా, ప్రధానో పాధ్యాయులు ఆర్ గోవింద రాజులు, ఎం. రామకృష్ణారెడ్డి , సాంబ నాయక్, విజయ భాస్కర్, సుభాని,డేవిడ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత సిహెచ్ వీరప్పయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు

ఆహార పదార్థాలను వ్యర్థం చేయొద్దు

ప్రజాశక్తి-కారంపూడి

ఆహారపదార్థాలను వ్యర్థం చేయొద్దని, మన పరిసరాలలో ఆకలితో ఉన్నవారికి అందించి వారిని ఆదుకోవాలని సాక్షరభారతి మండల కో-ఆర్డినేటర్ కూరాకుల సుబ్బారావు అన్నారు. స్వచ్ఛతా హి సేవా పక్షోత్సవాలలో భాగంగా మండలంలోని పేట సన్నిగండ్ల గ్రామ శివారు, పోతురాజు గుట్ట పరిధిలోని బాలచంద్ర నగర్ మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతర విద్యార్థులతో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్లు

వాలీబాల్ పోటీల్లో 'వాగ్దేవి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఈ నెల 27 న సత్తెనపల్లి జూనియర్ కళాశాలలో నిర్వహించిన అండర్ - 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో, నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఫుట్ బాల్ పోటీలలో,ఎపిఎస్ డబ్ల్యు.ఆర్.ఎస్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన రోప్ స్కిప్పింగ్ జిల్లా స్థాయి పోటీలలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. అండర్ - 19 వాలీబాల్ విభాగంలో బి.సాయి కుమార్, పి.హారిక, ఎం. శ్రీలక్ష్మి, ఫుట్ బాల్ పోటీలలో షేక్ నాగ షరీఫ్, ఎస్.డి రౌఫ్, షేక్. నాగ నజీర్, ఎం. ముఖేష్, అదేవిధంగా రోప్ స్కిప్పింగ్ పోటీలో షేక్ షాజహాన్ బి లు ఉత్తమ ప్రతిభ చటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ , కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిభ చాటిన తమ కళాశాల విద్యార్థులు అక్టోబర్ నెలలో గుంటూరు జిల్లాలో జరగబోయే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొన నున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కాట్ల రామ కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, పివి అచ్యుత రావు, ఫిజికల్ డైరెక్టర్ రాయల ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ఏదోఒకఆట ఆడాలి

- నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు
- 42 పాఠశాలల నుండి సుమారు 500 మంది క్రీడాకారులు హాజరు

ప్రజాశక్తి-నాదెండ్ల

సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు శుక్రవారం విజయవంతంగా జరిగాయి. ఆటల పోటీలను ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, సాతులూరు ఎంపిటిసి- 2 పాటిబండ్ల రాజేశ్వరి, సర్పంచ్ ఎం. శోభారాణి ప్రారంభించారు. 42 పాఠశాలల నుండి సుమారు 500 మంది క్రీడాకారులు అండర్-17 బాలబాలికలు, అండర్-14 బాల బాలికలు శుక్రవారం జరిగిన టోర్నమెంట్ కమ్ సెలక్షన్ ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగ, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ అథ్లెటిక్స్ పోటీలలో నియోజక వర్గస్థాయి టీం సెలక్షన్ జరిగింది. ఈ సందర్భంగా నాదెండ్ల మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు, మండల విద్యాశాఖ అధికారి-2 కృష్ణారెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక ఆట ఆడాలని తద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.అంజమ్మ, పాఠశాల సిబ్బంది నిర్వహించారు. చిలకలూరిపేట స్కూల్ గేమ్స్ నియోజకవర్గ కన్వీనర్ షేక్ అచినయ , పాఠశాల పిడి కె.అంజమ్మ , జిల్లా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ ప్రెసిడెంట్ పటాన్ ఖాదర మస్తాన్ , జాస్తి శ్రీకాంత్ , షేక్ బాజీ, ఎఎంజి రాజు, వేణు గోపాల్, సుబ్బారావు, ఫిలిప్ రాజు, నాగరాజు పాల్గొన్నారు.

అండర్-14 బాలికల ఖోఖో జట్టు

అండర్-17 బాలుర జట్టు కబడ్డీ

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు

- పొన్నూరు సిహెచ్‌సిలో ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళా
- 472 మందికి వైద్యసేవలు - అవయవదానికి ఆరుగురు అంగీకారం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యారోగ్య సేవలు అందించేందుకు ప్రవేశపెట్టిన ఆరోగ్య మేళ ఆయుష్మాన్ భవ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ కుటుంబ సంక్షేమం వైద్య శాఖ డైరెక్టర్ (ఎన్‌హెచ్‌ఎం) హర్షమంగ్ల కోరారు. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళ ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కె.వెంకట రోశయ్యతో కలిసి హర్ష మంగ్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గుంటూరు డిసిహెచ్ఎస్ కె.సుబ్రహ్మణ్యం రాజు అధ్యక్షత వహించారు. ఆరోగ్యమేళాలో ఏర్పాటు చేసిన గర్భిణీ, ప్రసవాలు, శస్త్ర చికిత్సలు, సాధారణ వైద్య సేవలు, చెవి, ముక్కు, గొంతు, చిన్నపిల్లల వైద్యనిపుణులు, మానసిక ఆరోగ్య నిపుణులు వైద్యులతో హర్షమంగ్ల మాట్లాడి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వార్డులు, ఎక్స్‌రే, రక్త పరీక్షల ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ ఆస్పత్రికి రోగులు తక్కువగా వచ్చేవారని, వైసిపి అధికారంలోకి వచ్చాక సదుపాయాలు పెరిగి నాణ్యమైన సేవలు అందిస్తుండడంతో రోజుకు 200 మంది వైద్య సేవలు పొందుతున్నారని చెప్పారు. గుండె జబ్బుతో ఆసుపత్రికి వచ్చిన వారిని ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించడానికి రూ.40 వేల ఖరీదైన ఇంజెక్షన్లు కూడా ఆస్పత్రిలో ఉంచుతామన్నారు. ఈ విధంగా ఇప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా 47 మంది గుండె జబ్బుల రోగుల ఇంజెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో 104 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. అయితే వైద్యాఆరోగ్య సిబ్బందికి జీతాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇదిలా ఉండగా ఆరోగ్య మేళాలో 472 మందికి పరీక్షలు చేశారు. డాక్టర్ యశ్వంత్, వేణుగోపాల్, సౌమ్య, దీక్షిత, వంశీ, కె.మేరీ అవయవ దానానికి ముందుకు వచ్చారు. వీరికి హర్షమంగ్ల, ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ రేష్మ, డాక్టర్ జెహెచ్ రావు, మున్సిపల్ కమిషనర్ నయీామ్ అహ్మద్, డిప్యూటీ డిఎంహెచ్ఓ అన్నపూర్ణ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి ఆసుపత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న బృందం

జిల్లా ఆస్పత్రిలో ఎన్‌హెచ్‌ఆర్‌ఎం బృందం పరిశీలన

ప్రజాశక్తి-తెనాలి

తెనాలిలోని జిల్లా వైద్యశాలను నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ బృందం శుక్రవారం సందర్శించింది. ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ హర్ష్ మంగ్లా సారధ్యంలో ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ సర్వీసెస్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి వైద్య బృందంతో చర్చించారు. ఆసుపత్రి వెనుక వైపు నిర్మించతలపెట్టిన 100 పడకల క్రిటికల్ కేర్ బ్లాకు ప్రాంతాన్ని పరిశీలించారు. రోగులతో మాట్లాడి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సదుపాయాలను తెలుసుకున్నారు. పారిశుధ్యం, వివిధ విభాగాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు సమిష్టి భాగస్వామ్యంతో రోగులకు మరింత మెరుగైన సౌకర్యాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిసిహెచ్ డాక్టర్ జె.హనుమంతరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెగా చెక్కును అందచేస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

12,545 మందికి వాహన మిత్ర

ప్రజాశక్తి-గుంటూరు

ఆటో, ట్యాక్సీ వాహన యజమానులు, డ్రైవర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. నిర్వహణ భారం, ఇన్సూరెన్స్ ప్రీమియం, ఫిట్నెస్ ఫీజులు చెల్లింపునకు వరసుగా 5వ విడత వాహన మిత్ర పథకం క్రింద జిల్లాలోని 12,545 మందికి రూ.12.54 కోట్లను వారి బ్యాంక్ ఖాతాలకే జమ చేసినట్లు చెప్పారు. శుక్రవారం విజయవాడలోని విద్యాదరాపురం, మినిస్టేడియం నుండి సిఎం జగన్ మోహన్‌రెడ్డి 5వ విడత వాహన మిత్ర లబ్దిదారులకు బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా గుంటూరు కలక్టరేట్ నుండి కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఎం.పురోషోత్తం, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు సహాయ కార్పోరేషన్ చైర్మన్ ముంతాజ్ పటాన్, జిఎంసి డిప్యూటీ మేయర్ సజిలా, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్.ఆబిధా బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.12.54 కోట్ల మెగా చెక్కును లబ్ధిదార్లకు అందించారు. జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి, ఆర్‌టిఓలు ప్రసాదరావు, గోపాల్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మల్లేశ్వరి, విజయ సారధి, ఆటో, క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు నిడమర్రు విద్యార్థులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు నిడమర్రు హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారిలో ఎం.శివగాయత్రి, ఎన్.కల్యాణి, డి.అఖిల్ ఉన్నట్లు చెప్పారు. వీరు 1, 2 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను పీడీ ఎన్.రవి, గుంటూరు జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్, బాపూజీ విద్యాలయ కరస్పాండెంట్ వై.సుజాత, పిఎంసి చైర్మన్ బి.రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు. ఇదిలా ఉండగా నవులూరు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభను చాటి జిల్లా జట్లకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి.వెంకమ్మ, పీడీ సాంబశివరావు తెలిపారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులతో హెచ్‌ఎం

పలు క్రీడల్లో తాడికొండ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడికొండ

తమ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తాడికొండలోని శ్రీ వెళ్ళంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.దేవరాజ్ శుక్రవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో తమ పాఠశాల నుండి 46 మంది విద్యార్థినులు, 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. వీరు అండర్-14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్, బాడ్మింటన్, త్రోబాల్, టెన్నికాయిట్, కబడ్డీ, ఖోఖో యోగా తదితర క్రీడాంశాల్లో జిల్లాస్థాయిలో పోటీ పడనున్నారని తెలిపారు. ఎంపికైన వారిని పలువురు అభినందించారు.

8న 'రాజ్యాంగ చర్చావేదిక' ఆవిర్భావ సభ

ప్రజాశక్తి-గుంటూరు

రాజ్యాంగ చర్చావేదిక ఆవిర్భావ సభ అక్టోబర్ 8న స్థానిక గీతారీజెన్సీలో నిర్వహిస్తామని చర్చావేదిక అధ్యక్షులు, న్యాయవాది నడింపల్లి గురుదత్, కార్యదర్శి అవధానుల హరి తెలిపారు. శుక్రవారం స్థానిక గీతారీజెన్సీలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాలు జరుపుకుంటున్న వేళ భారత ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, పౌరుల హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగ వ్యవస్థల సక్రమ నిర్వహణ, చట్టబద్ధ పాలనకు రాజ్యాంగమే శిరోధార్యమని నమ్ముతూ చర్చావేదికను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. భారత రాజ్యాంగం, పౌరుల హక్కులు, బాధ్యతలపై రాజకీయాలకతీతంగా సమాజాన్ని చైతన్యవంతం చేయాలనే లక్ష్యంతో న్యాయవాదులు, డాక్టర్లు, మేధావులు, సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యాంగ చర్చా వేదిక రూపుదిద్దుకుందని చెప్పారు. ఆవిర్భావ సభకు ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ కె.మన్మధరావు, ప్రొఫెసర్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో చర్చా వేదిక సహాయ కార్యదర్శి డాక్టర్ టి.సేవకుమార్, ఆడిటర్ పివి మల్లికార్జునరావు, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త జె.రామారావు, కి.రాజన్‌బాబు, వై.వి.ఎస్ మహదేవ్ పాల్గొన్నారు.

మాట్లాడుతునన గురుదత్, హరి తదితరులు

అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

- నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు
- బిల్లులు విడుదల చేయాలన్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో అభివృద్ధి పనుల నిర్వహణకు టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులోపు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ మేయర్ ఛాంబర్‌లో నగరంలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు స్థానిక ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు నిర్వహించాలన్నారు. కాంట్రాక్టు దక్కించుకొని నిర్దేశిత సమయంలోపు పనులు ప్రారంభించని పనుల వివరాలు తెలుసుకొని అందుకు గల కారణాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్లు మాట్లాడుతూ ఇప్పటికే పూర్తి చేసిన పలు అభివృద్ధి పనుల తాలూక బిల్లులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కోరగా, స్పందించిన మేయర్ అభివృద్ధి పనులు పూర్తి చేసిన వాటికి ప్రాధాన్యతా క్రమంలో బిల్లులు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పనులు జరిగే సమయంలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పనులను ప్రత్యక్షంగా తనిఖీ చేయాలని, పనుల్లో నాణ్యత లేకపోతే కాంట్రాక్టర్‌పై, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్‌ఇ భాస్కరరావు, ఇఇ సుందరరామిరెడ్డి, డిఇఇలు, ఎఇలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మనోహర్‌నాయుడు

మాట్లాడుతున్న చాంద్‌బాషా

జిపిఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) లక్షల మంది ఉద్యోగుల కల అని, ప్రభుత్వం ఆకల నెరవేర్చే దిశగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా కోరారు. శుక్రవారం సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిపిఎస్ బిల్లు ఉద్యోగుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టేలా ఉందని, ప్రభుత్వం స్పందించి సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ఉద్యోగులకు లబ్ధి చేకూరేలా ఒపిఎస్ అమలు చేయాలన్నారు. ఈ అంశం మీద అక్టోబర్ 8వ తేదీన జరిగే ఎపిజిఇఎ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కరిముల్లా షాఖాదరి, ఉపాధ్యక్షులు హుస్సేన్ ఖాన్, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శి కనకారావు, కార్యదర్శి దక్షిణామూర్తి పాల్గొన్నారు.

నాగసందీప్‌కు మెడిసిన్‌లో ఉచిత సీటు

ప్రజాశక్తి-తాడేపల్లి

బండి నాగసందీప్ మధ్యప్రదేశ్‌లోని రేలాలో ఎమ్‌డి జనరల్ మెడికల్ ఉచిత సీటు సాధించారు. నాగసందీప్ తండ్రి వరప్రసాద్ తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఉచిత సీటు వచ్చిన సందర్భంగా శుక్రవారం నాగసందీప్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. సందీప్ ప్రాథమిక విద్య ఉండవల్లి, నరసారావుపేటలో అభ్యసించారు. పదో తరగతి విజయవాడలోని చైతన్య హైస్కూల్లో చదివారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. గోవిందరావు

మున్సిపల్,పారిశుధ్య కార్మికులకు వైద్యశిబిరం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్వచ్ఛత లీగ్ 2.0, ప్రపంచ హృదయ దినోత్సవ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ సి. హెచ్ గోవిందారావు ఆధ్వర్యంలో రామారావు మల్టీ స్పెషాల్టి హాస్పిటల్ సహకారంతో మునిసిపల్,పారిశుధ్య కార్మికులకు గుండె పరీక్షలు, స్త్రీలకు సంబంధిత సమస్యల పై హెల్త్ క్యాంపును శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథి మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అహర్నిశలు శ్రమ పడతారని,వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మున్సిపాలిటీ అధికారులు ,ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ఇటువంటి హెల్త్ క్యాంపుల వలన వారికి ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఇటువంటి హెల్త్ క్యాంపుల వలన భవిషత్తు లో హార్ట్ ఎటాక్స్ రాకుండా జాగ్రత్త పడడానికి అవకాశం ఉంటుందని అన్నారు. పారిశుధ్య కార్మికులకు బిపి,షుగం, కొలెస్ట్రాల్ టెస్టులను ఉచితంగా నిర్వహించారు.. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు కె. శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వర్లు, పట్టణ వైసిపి అధ్యక్షులు పఠాన్ తలహా ఖాన్,ఫణి మునిసిపల్ డిఇ. టి. రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రహదారిపై ఇసుక, కంకర కుప్పలు పోస్తే ఎలా?

ప్రజాశక్తి - చిలకలూరిపేట

గత శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మరణించిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదం జరిగిన జాతీయరహదారిపై ఇసుక,కంకర కుప్పలు పోసి నిర్మాణ పనులు చేపట్టడం ఎంతవరకు సబబు అని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాదాసు భాను ప్రసాద్ ప్రశ్నించారు. పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం ఏం చేస్తోందని విమర్శించారు. ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని,టెన్ పాయింట్ ఫార్ములానును పటిష్టంగా అమలు చేసి రోడ్డు ప్రమాద నివారణకు తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

సిఎం జగన్ నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి-క్రోసూరు

కులాల ప్రాతిపదికన గణన చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటన చేయడం హర్షణీయమని పెదకూరపాడు నియోజకవర్గ బిసి సంఘం అధ్యక్షుడు పోతురాజు గురుస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన జరిగినప్పుడే రిజర్వేషన్ల అమలు తీరు ఏ మేరకు ఉందన్న విషయం, విద్యా ఉద్యోగ రాజకీయ అవకాశాలపై కూడా స్పష్టత వస్తుందని అన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి -అమరావతి

శ్రీ అమరేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రధాన హుండీల ద్వారా రూ.6,50,061 వచ్చిందని ఈవో గోపి తెలిపారు ఒకటిన్నర నెలరోజులు గాను రు.67,267/- ఆదాయం వచ్చిందని తెలిపారు. శుక్రవారం హుండీల లెక్కింపు కార్యక్రమం దేవస్థానం ఈఓ వేమూరి గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు.

అత్యవసర పరిస్థితిలో ప్రాణాలు నిలిపే సిపిఆర్

డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సి పి ఆర్ ప్రథమ చికిత్సపై పోలీసులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి

అత్యవసర, ప్రాణాపాయ పరిస్థితుల్లో సిపిఆర్ ద్వారా ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉంటుందని వ్యక్తి ఆక్సిజన్ తీసుకోలేనప్పుడు గుండెకు ఆక్సిజన్ పంపింగ్ చేసేందుకు సిపిఆర్ దోహదం చేస్తుందని మహాత్మా గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచ హృద్రోగ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం సి పి ఆర్ ప్రథమ చికిత్సపై పల్నాడు పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా డాక్టర్ కారసాని మాట్లాడుతూ సరైన వైద్యం తీసుకునే ముందు అంబులెన్స్ వచ్చేలోగా ప్రథమ చికిత్స పై అవగాహన కలిగి ఉండటం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. సిపిఆర్ ప్రక్రియ ఆగిపోయే గుండెను పనిచేసేలా చేయడాన్ని సిపిఆర్ ప్రథమ చికిత్స అంటారన్నారు. సిపిఆర్ ను గుండె ఆగిన వెంటనే చేయడం ద్వారా ప్రయోజనం ఉంటుందన్నారు.

గుండెకు సంబంధించి జబ్బులు శ్వాసకోశ సమస్యలు

ఈ జబ్బులు ప్రధానంగా ఊభ కాయం వారికి, మధుమేహం, మద్యపానం ధూమపానం చేసే వారికి, వంశపారంపర్యంగా సంక్రమించే జ బ్బులు.. వీరిలో ప్రధానంగా హార్ట్ స్ట్రోకులు, గుండె యొక్క రక్తనాళాలు పూడిపోవటం, పట్టుకుతే వచ్చే సమస్యలు చూస్తూ ఉంటాం. కానీ అలాంటివారు సడన్గా డెత్ అయితే వెంటనే మనం సిపిఆర్ విధానాన్ని అనుసరించాలన్నారు. మనిషిని వెలికల బాగా గాలి తగిలే ప్రదేశంలో ఉంచాలి, అనంతరం తన యొక్క చాతిపై నిమిషానికి కనీసం 70 నుంచి 80 సార్లు చేతి వేళ్ళు మరియు మడమతో ఎక్కువసార్లు ఒత్తిడి కలిగేలాగా ప్రేరేపించాలన్నారు. ఇలాగా మనిషి యొక్క శరీరం బాగా కుదుపులకు లోనయ్యేలా చూడాలి ఊపిరి ఆగి ప్రాణం పోవడానికి సెకండ్ కూడా పట్టదు, కాబట్టి వెంటనే సిపిఆర్ ను ప్రారంభిస్తే ప్రాణాన్ని కాపాడవచ్చున్నారు.గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు వారి ప్రాణాలను కాపాడేందుకు చేసే అత్యవసర ప్రక్రియ సిపిఆర్ అని ఈ ప్రాథమిక చికిత్సలో అత్యంత కీలకమైనది కార్డియో పల్మనరి రిససిటేషన్(సిపిఆర్) బాధితులను ప్రాణాపాయం నుంచి కాపాడే ఏకైక సాధనమే ఈ విధానం అని దీని పట్ల పాశ్చాత్య దేశాల్లో ప్రజలకు బాగా అవగాహన ఉందని మనదేశంలో ఇప్పటికీ ఈ విధానం గురించి కొంతమందికి తెలియదన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కారసాని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కాన్ సెంటర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి ఆర్డీఓ బిఎల్ఎన్ రాజకుమారి హెచ్చరించారు.. సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో పి సి పి ఎన్ డి టి యాక్ట్ పై ఉప జిల్లా సాయి సత్తెనపల్లి మల్టీ మెంబర్స్అథారిటీ మరియు ఉప జిల్లాస్థాయి స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశము శుక్రవారం నిర్వహించారు. ఆర్డీఓ రాజకుమారి మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని మరియు డేకాయ ఆపరేషన్లు నిర్వహించాలని ఎవరైనా ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే 102 మరియు 104 నంబర్లకు ఫోను చేసి తెలియజేయవచ్చునని వెల్లడించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం. పద్మావతి,డివిజన్ ఇంచార్జి డా. నాగ పద్మజ, కమిటీ సభ్యులు డాక్టర్ సుష్మ, డాక్టర్ ప్రేమ,డాక్టర్ అనూష,జిల్లా డిప్యూటీ డెమో కె.సాంబశివరావు, ఖాజావలి, యన్.జి.ఓ సంస్థల ప్రతినిధులు బి.నాగ సాయిప్రసాద్, కె. వెంకటేశ్వరరావు, పి.సాంబశివరావు పాల్గొన్నారు.

సమావేశం లో మాట్లాడుతున్న ఆర్డీఓ రాజకుమారి

నదిలోకి దూకి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల వద్ద కృష్ణానదిలోకి దూకి ఒక యువకుడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలిసింది. పోలీసుల కథనం ప్రకారం దాచేపల్లి పట్టణానికి చెందిన జి.నరసింహా (23) అనే యువకుడు కుటుంబ కలహాలతో కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. తెలంగాణ పరిధిలో మృతదేహం లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ వైద్యం

ప్రజాశక్తి- క్రోసూరు

అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరోగ్య సేవలు అన్ని అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రజల ముంగిట్లోకి తీసుకువచ్చిందని ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య అన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారం చేస్తారని చెప్పారు. ఇప్పటికే వాలంటీర్లు, గృహసారథులు వారి పరిధిలోని ఇళ్లను సందర్శించి ప్రజలందరికీ ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో ఉన్న ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి ప్రభుత్వ సిబ్బంది. అడిగి తెలుసుకుంటు న్నారన్నారు. బిపి షుగర్ హిమగ్లోబిన్ యూరిన్ టెస్ట్ లు మొత్తం 7 రకాల టెస్టులు చేయడం జరుగుతుందన్నారు.

అమరావతిలో నేడు ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి- అమరావతి

మండల కేంద్రమైన అమరావతి గ్రామపంచాయతీ సచివాలయ ఒకటవ పరిధిలోని శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్లో శనివారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి పి.నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు, ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, తదితరులు హాజరవుతారని చెప్పారు.

వాహన మిత్ర నగదును సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొంది ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగే ప్రయత్నం చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు.5వ విడత వైయస్సార్ వాహన మిత్ర పథకం అమలులో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తద్వారా జీవితంలో పైకి ఎదిగేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా డ్రైవర్లకు సూచించారు.

వైయస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా ఈ ఏడాది రాష్ట్రంలో 2,75,931 మందికి గాను రూ.275.93 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, పల్నాడు జిల్లాలో 8462 మందికి గాను రూ. 8.46 కోట్లు మంజూరు చేయటం జరిగిందని ఆయన తెలిపారు. మెగా చెక్కును కలెక్టర్ ఆవి ష్కరించారు. ఈ ఆర్థిక సహాయాన్ని ఇన్సూరెన్స్ కట్టుకోవడం, చిన్న చిన్న రిపేర్లను చేయించు కోవడం, ఫిట్నెస్ రెన్యువల్ చేయించుకోవడానికి వినియోగించుకోవాలన్నారు. డ్రైవర్లు తమ ఆరోగ్యంపై, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో అసి స్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ, డిస్ట్రిక్ట్ ట్రాన్స్ మెంట్ ఆఫీసర్ టి.కె.పరంధామ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సత్య నారాయణ ప్రసాద్, శివ నాగే శ్వరరావు, నాగలక్ష్మి, వాహన మిత్ర డ్రైవర్లు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' సమర్ధవంతంగా అమలు చేయాలి

జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని పల్నాడు జిల్లాలో సమర్ధవంతంగా అమలు చేయాలని కలెక్టర్ శివ శంకర్ జిల్లా అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. పల్నాడు జిల్లా నుండి ఇంచార్జి అధికారిణి కమిషనర్ పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ సూర్య కుమారి, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్ప శ్రీ, డీఎంహెచ్వో శోభారాణి లు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలు మరింత సమర్ధవంతంగా చేయాలన్నారు, పథకం అమలు తీరుపై అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మెగా చెక్కు విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ తదితరులు

కార్పొరేటర్లతో ప్రతి శుక్రవారం గ్రీవెన్స్

- ప్రత్యేక సమీక్షలో కమిషనర్
- ఫిర్యాదులు, పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు

కార్పోరేటర్ల నుండి అందే ఫిర్యాదులు, ఆర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదికివ్వాలని విభాగాధిపతులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై కార్పొరేటర్లతో కమిషనర్ తన ఛాంబర్‌లో శుక్రవారం ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యల పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ప్రతి సోమవారం స్పందన, ప్రతి రోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు ప్రజా స్పందన నిర్వహిస్తున్నామన్నారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు కూడా కమిషనర్‌తో చర్చించడానికి ప్రత్యేక సమయం కావాలని కోరిన దృష్ట్యా ప్రతి శుక్రవారం కార్పొరేటర్లు తమ వార్డుకు సంబంధించిన అంశాలు చర్చించేందుకు అవకాశం ఉందన్నారు. మిగిలిన రోజుల్లోనూ కార్పొరేటర్లకు అందుబాటులో ఉంటామని, వాట్సప్‌లో తెలిపినా కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్పొరేటర్ల నుండి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారులను ఆదేశించామని వివరించారు.

ఆరోగ్య సురక్ష క్యాంపులపై సమీక్ష

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. శనివారం నుండి నగరంలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ల ఏర్పాటుపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, జిఎంసి అధికారులతో ప్రత్యేక సమావేశం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 30 నుండి నవంబర్ 15 వరకు ప్రత్యేకంగా నిపుణులైన వైద్యులతో ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తామని, ఇందులో భాగంగా నగరంలోని 29 వైయస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల వద్ద క్యాంప్‌లు జరుగుతాయని, అందుకు అవసరమైన మౌలిక

కార్పొరేటర్ల అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్

వసతులు ఏర్పాటు చేయాలని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని సమన్వయం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. ప్రతి సెంటర్‌లో రోజుకు 1500 మందికి వైద్య పరీక్షలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని, వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి పరీక్షల నివేదిక, అవసరమైన మందులతో కిట్‌ని అందిచాలని అన్నారు. 45 రోజుల పాటు జగనన్న సురక్ష క్యాంప్‌లను వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జయరామకృష్ణ, ఎస్ఇ. భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్ఒ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, సూపరిండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

పోషకాహారంపై ఇంటింటికీ అవగాహన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.సురేష్ అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆత్మకూరులో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పోషకాహారం లోపం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. పాలు, గుడ్లు, పండ్లు, చిరుధాన్యాలు, కాయకూరలు తీసుకోవడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి సురేష్‌తోపాటు జి.చంద్రశేఖర్, విజి కృష్ణమూర్తి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. వాలంటీర్లను వర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రో వీసీ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్, డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య అభినందించారు.

మెటీరియల్ సైన్స్‌తో విప్లవాత్మక ప్రగతి

ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ ప్రెసిడెంట్ ఉమేష్ వాగ్మారే

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మెటీరియల్ సైన్స్‌తో అన్ని రంగాల్లోనూ విప్లవాత్మక ప్రగతి సాధ్యమని బెంగళూరు ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ ప్రెసిడెంట్, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఉమేష్ వాగ్మారే అన్నారు. పాలిమర్స్, సిరామిక్స్, ఐరన్, స్టీల్ వంటి మెటీరియల్స్‌తో ముడిపడ్డ వివిధ రంగాలు ఎంతో పురోగతిని సాధించాయని చెప్పారు. 'మెటీరియల్స్-టెక్నాలజీ'పై ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన చర్చాగోష్ఠిలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వివిధ రకాల రసాయన మూలకాలు, వాటి స్వరూపాలు, ప్రయోజనాలు, సొసైటీ ప్రగతికి దోహదపడ్డ అంశాలను వివరించారు. కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటెడ్ సైన్సెస్ సెంటరు ప్రారంభించారు. విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లకు నూతన పరిశోధనలు, ఆవిష్కరణలఅంశాల్లో పలు సూచనలు చేశారు. దేశ

డాక్టర్ వాగ్మారేకు జ్ఞాపికను ఇస్తున్న రిజిస్ట్రార్ ప్రేమకుమార్

సమగ్ర ప్రగతికి దోహదపడే వినూత్న కార్యక్రమాలలో నిమగ్నమయ్యేలా పరిశోధకులు, విద్యార్థులను ప్రేరేపించడం యూనివర్సిటీ విశిష్ట ఉపన్యాస కార్యక్రమ లక్ష్యమని ఎస్ఆర్ఎం వర్సిటీ సలహాదారు డాక్టర్ వజ్జా సాంబశివరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమకుమార్, డీన్ డాక్టర్ రంజిత్ చాపాలు, యూనివర్సిటీ డైరెక్టర్లు, డీన్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆరోగ్య సురక్ష సర్వే

ప్రజాశక్తి-తెనాలి : జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్నట్లు ఆరోగ్య సిబ్బంది చెప్పారు. పట్టణంలోని 46 సచివాలయాల పరిధిలోని ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, వార్డు వాలంటీర్లు ఇంటింటికి తిరిగి బిపి, షుగర్, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్నవారిని గుర్తిస్తున్నారు. శుక్రవారం మాదలవారివీధి, రావి రవీంద్రనాథ్ నగర్, లింగారావు సెంటర్, చినరావూరు, ఉడాకాలని, కొత్తపేటలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటినీ సందర్శించారు. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గుర్తించిన వారికి వచ్చేనెల ఐదోతేదీ నుంచి వైద్య శిబిరాల్లో వైద్యసేవలు అందించనున్నారు.

కెఎల్‌యు విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రక్తదానమంటే మరొకరికి ప్రాణదానం చేయడమే అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ హర్ష్ మంగ్లా అన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ హాలులో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రక్తం దొరకని క్లిష్ట పరిస్థితులలో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు పలు సర్వేల్లో తేలిందన్నారు. రక్తదానానికి అందరూ ముందుకు రావాలని, ప్రైవేటు విద్యాసంస్థల జాబితాలో కెఎల్ వర్శిటీ విద్యార్థులు రక్తదానంలో ముందంజలో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వానికి అత్యధిక రక్త యూనిట్లను అందించినందుకు వర్శిటీకి ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్‌ను అందించారు. వర్శిటీలో ఎక్కువ సార్లు రక్తదానం చేసిన విద్యార్థులకూ ధ్రువపత్రాలిచ్చారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది రక్తదానం చేశారు.

కంటి వైద్యశిబిరం

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గుంటూరులోని నెహ్రూ యువ కేంద్రాకు అనుబంధ సంస్థ అయిన సత్తెనపల్లిలోని హెల్ప్ ఫౌండేషన్, చెరుకుపల్లిలోని కామాక్షి ఐ కేర్ సహకారంతో కెఎల్‌యులోని యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శిబిరాన్ని వర్సిటీలోని హాబీ క్లబ్ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆర్.సుభాకర్ రాజు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఎక్కువగా లాప్‌టాప్, కంప్యూటర్, మొబైల్ ఫోన్‌లు ఉపయోగించడం వల్ల కంటి సమస్యలు పెడుతున్నాయని అన్నారు. యూత్ రెడ్‌క్రాస్ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి కె.సుకీర్తి మాట్లాడుతూ జీవితాంతం కంటి చూపు మెరుగ్గా ఉండాలంటే కొన్ని అలవాట్లను మార్చు కోవాలన్నారు. కంప్యూటర్ దగ్గర పనిచేసే సమయంలో తగినంత దూరాన్ని పాటించాలని, ధూమపానం మానేయాలని సూచించారు. కార్యక్రమాల్లో కార్యక్రమంలో జాతీయ

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆరోగ్య మిషన్, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.నివాస్, రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర, వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, వర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, వైఆర్‌సి ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి కె.సుకీర్తి, కో-ఆర్డినేటర్ సత్యానారాయణ, డాక్టర్ వాసుదేవ్, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.బుల్లిబాబు, డాక్టర్ వెంకటేశ్వరరావు, హాస్పిటల్ సిబ్బంది వనిత, సదాశివరావు పాల్గొన్నారు.

నాగరాజును సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి నాగరాజుకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కోశాధికారిగా పి.నాగరాజు ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆయన్ను సన్మానించారు. లూర్దురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎన్.వి.నరసింహారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఎంఎన్.మూర్తి, ఎటిఒ ఫణి, ఎస్‌టిఒ జి.రామకృష్ణ, సాయిబాబు, ఎంబి.సుబ్బారావు, బి.వెంకట్రావు, మాధవరావు, డానియల్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర శాఖ ద్వారా ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పెన్షనర్లకు 1న పెన్షన్ వచ్చే విధంగా, డిఎ అరియర్లు, పిఆర్‌సి అరియర్లు, ఈహెచ్ఎస్ లోపాల సవరణకు తన వంతు కృషి చేస్తానని నాగరాజు తెలిపారు.

బాలాజి సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-తెనాలి

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2గా పనిచేస్తున్న కె.బాలాజిసింగ్ (59) ఆకస్మికంగా మృతిచెందారు. మిలాద్ ఉన్ నబి సందర్భంగా గురువారం ప్రభుత్వ సెలవు దినం కావటంతో ఇంటి వద్దనే ఉన్న ఆయన పొద్దుపోయిన తరువాత తీవ్రమైన గుండెపోటుతో అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు చెప్పారు. స్థానిక నాజరుపేట స్వగృహంలో ఉంచిన ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఎం.హరిప్రసాద్, వి.రామలింగాచారి, కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు, డాక్యుమెంట్ రైటర్లు సందర్శించి నివాళులర్పించారు.

5-18 ఏళ్ల వారంతా విద్యాసంస్థల్లో ఉండాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

బడి బయట పిల్లల్ని నూరుశాతం విద్యాసంస్థల్లో చేర్పించే కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. ఎంపిడిఒ బి.బాబురావు మాట్లాడుతూ 5-18 ఏళ్ల పిల్లలంతా పాఠశాలల్లో లేదా కళాశాలలో ఉండేలా చూడాలన్నారు. ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ లేదా స్కిల్ సెంటర్‌లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ సెంటరు, నారాకోడూరు జెడ్‌పి పాఠశాలలో స్కిల్ సెంటర్ ఉందని తెలిపారు. ఎంఇఒలు ఎవిహెచ్ ప్రసాద్, ఆర్.సుబ్బారావు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో మండల వ్యాప్తంగా 280 మంది డ్రాపౌట్స్ పిల్లలు ఉండగా ఇప్పటివరకు 140 మందిని ఓపెన్ టెన్త్, స్కిల్ సెంటర్లో చేర్పించినట్లు తెలిపారు. మిగిలిన 40 మందిని గుర్తించి త్వరలోనే చేర్పిస్తామన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కిరణ్, ఇతర నాయకులు

నేడు ఎస్ఎఫ్ఐ చలో విజయవాడ

ప్రజాశక్తి-గుంటూరు

విద్యారంగంలో నెలకొన్న సమస్యలును పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నేడు చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి సమస్యలు పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తారనుకున్నాం కానీ ఎటువంటి చర్చ లేకుండా సమావేశాలు ముగిశాయని అన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించాలని, జీవో 77ని రద్దుచేసి పీజీ విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన వర్తింప చేయాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్, టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, నూతన జాతీయ విద్యా విధానం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై నిర్వహించే చలో విజయవాడకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, ఎస్.కె.సమీర్, నాయకులు యశ్వంత్, వంశి పాల్గొన్నారు.

రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ప్రమాదకరమైన జీవో నెంబర్ 21 రద్దు చేయాలి
- ఫీజులు, పెనాల్టీలు, ఇంధనం, గ్యాస్ ధరలు తగ్గించాలి
- 6న చలో విజయవాడ
- కొనసాగిన ప్రచార జాతా

మంగళగిరిలో మాట్లాడుతున్న సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా విలేకర్లు

రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్, గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా జాతా రెండోరోజైన శుక్రవారం మంగళగిరిలో ప్రారంభమైంది. తాడేపల్లి, తాడేపల్లి రూరల్, దుగ్గిరాల, కొల్లిపర, తెనాలి, పెదకాకానిలో జాతా పర్యటించింది. ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, ఎన్.శివాజి మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకొని, ఉద్యోగాల్లేక నిరుద్యోగులైన అనేక మంది ఆటో డ్రైవర్లుగా జీవిస్తున్నారని చెప్పారు. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల వద్ద అప్పులు చేసి ఆటోలు కొనుగోలు నడుపుకుంటున్నారని అన్నారు. వీరికి ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వాలు నిరంతరం ఈ-చలానాల పేరుతో ఆర్‌టిఒ, పోలీసు అధికారులు భారీ మొత్తంలో ఫెనాల్టీలు విధిస్తున్నారన్నారు. కరోనా తరువాత బాడుగల్లేక, ప్రతి నెలా కిస్తీలు కట్టలేక తీవ్ర ఇబ్బందుల్లు పడుతుంటే మరోప్రక్క పెరిగిన పెట్రోలు, డీజిల్, గ్యాస్, ఇన్సూరెన్స్ ప్రీమియం పెంచటం తోపాటు జిఎస్‌టి పేరుతో 18 శాతం టాక్స్ వసూలుతో రవాణా రంగాన్ని ప్రభుత్వాలు ఆదాయ వనరుగా భావించి వ్యవహరిస్తున్నాయే తప్ప మరోకటి కాదన్నారు. గ్రీన్ టాక్స్ పెంచటం, రాష్ట్ర ప్రభుత్వం మోటారు వాహనాల చట్ట సవరణ చేస్తూ జిఒ 21 ద్వారా అన్ని రకాల ఫీజులు, ఫెనాల్టీలు పెంచటం, పొరపాటున యాక్సిడెంట్ జరిగి ఎవరైనా చనిపోతే డ్రైవర్లకు జైలు శిక్ష విధించే 304(ఎ) లాంటి చట్టాలు తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టాల వల్ల ఏ ఒక్క వాహనం కూడా రోడ్లపై తిప్పే పరిస్థితి ఉండదన్నారు. జిఒ 21ను తక్షణమే రద్దు చేయాలని, పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలని, పట్టణ ప్రాంతాల్లో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాదానికి గురైనప్పుడు డ్రైవర్ కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై 6న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాలో ఆటో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమం సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య, వి.దుర్గారావు, బి.వెంకటేశ్వర్లు, ఎం.శివసాంబిరెడ్డి, శ్రీనివాసరావు, శ్రీరాములు, సాంబశివరావు, జెస్సి కొండలు, నవీన్, చిన్నారావు, షేక్ కరిముల్లా, మీరాఖాన్, జిలాని, వెంకటేశ్వర్లు, సుబాని, రమేష్, కాలేషా, ఖాసిం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

ఫార్మసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఫార్మసీ విద్యార్థులు పరిశోధనల వైపు ఆసక్తి పెంచుకోవాలని, అప్పుడే దేశానికి ఉపయోగపడే విధంగా కొత్త మందుల ఆవిష్కరణలకు నాంది పలకవచ్చని గుంటూరులోని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ దోనవల్లి లక్ష్మణ్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల, సూట్స్ కేర్ నెట్‌వర్క్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రివెంటెవ్ అండ్ ఎమర్జెన్సీ మెడికల్ సైన్సెస్' అనే అంశంపై రెండ్రోజుల జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కాన్ఫరెన్స్‌ను 'ఏ పారాడిమ్ షిఫ్ట్ ఆఫ్ క్లినికల్ ప్రాక్టీస్ ఫ్రమ్ హాస్పిటల్ టు కమ్యూనిటీ ఎట్ లార్జ్' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. డాక్టర్ దోనవల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ విద్యార్థులు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తేనే విజయం సాధించగలరని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి విజన్‌తో ముందుకెళ్లాలని, క్రమశిక్షణతో విద్యను అభ్యశిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కారే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో ప్రభలుతున్న వ్యాధులపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఫార్మాస్యూటికల్ విద్యార్థులకు దేశ విదేశాలలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సూట్స్ కేర్ నెట్‌వర్క్ సీఈవో డాక్టర్ సోమశేఖర రెడ్డి, డైరక్టర్ డాక్టర్ ప్రిన్స్ అభిషేక్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ.శ్రీనివాసబాబు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై త్రిసభ్య కమిటీ : జెసి

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

రంగు మారిన తాగునీటిని జెసికి చూపిస్తున్న మహిళలు

పెదనందిపాడులో తాగునీటి సమస్యపై ప్రత్యేక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.రాజకుమారి అన్నారు. మండల కేంద్రమైన పెదనందిపాడులో శుక్రవారంనిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'లో స్థానిక మహిళలు సమస్యను వివరించారు. కొంతకాలంగా పెదనందిపాడులో కుళాయిలు ద్వారా వచ్చే నీరు రంగు మారి దుర్గంధ వాసనతో వస్తున్నాయని చెప్పారు. ఆ నీటివల్ల కొంతమంది చర్మ వ్యాధులతో బాధపడుతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన జెసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జెసి మాట్లాడుతూ జిల్లాలో స్పందన కార్యక్రమానికి గ్రామాల నుండి అర్జీలు అధిక సంఖ్యలో వస్తున్నాయని, వీటి పరిశీలన కోసం క్షేత్రస్థాయికే వస్తున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా అభివృద్ధి పనులు విషయంలో జెసి ఎదుట అధికార, ప్రతిపక్ష పార్టీల శ్రేణులు వాదోపవాదాలకు దిగారు. పనులకు ప్రతిపక్ష వారు ఆటంకం కలిగిస్తున్నారని అధికారపక్షం ఆరోపించగా.. పనులు సరిగా ఉంటే తామెందుకు అడ్డు పడతామని ప్రతిపక్షం నాయకులు అన్నారు. కార్యక్రమంలో మొత్తం 95 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి బి.మనోరంజని, ఎంపిడిఒ రాజగోపాల్, తహశీల్దార్ మహబూబ్ సుభాని, పత్తిపాడు యార్డ్ డైరెక్టర్ షేక్ ఖాసిం పీరా, సొసైటీ డైరెక్టర్ నాగయ్య పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఐస్ స్కేటింగ్‌కు గుంటూరు విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

స్కేటర్లను అభినందిస్తున్న కమిషనర్

పిల్లలను వారికి ఆసక్తి ఉన్న ఆటల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. గుంటూరు నగరం నుండి జాతీయ స్థాయి ఐస్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. స్కేటింగ్ కోచ్‌లు ఇమ్రాన్, అప్సర్‌ను అభినందించారు. ఈనెల 14న నగరంలోని బిఆర్ స్టేడియంలో జరిగిన ఐస్ స్కేటింగ్ నేషనల్ సెలక్షన్ పోటీల్లో గుంటూరు నగరానికి చెందిన ఐకెఎస్‌ఏ స్కేటింగ్ అకాడమి క్రీడాకారులు 1 బంగారు, 5 వెండి, 2 కాంశ్య పతకాలు సాధించి డిశంబర్‌లో గుర్గావ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. గుంటూరు నగరంలోని పార్కుల్లో పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నామని, త్వరలో గుంటూరులో స్కేటింగ్ రింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక అమరావతి ఫ్లాట్స్ అన్నాబత్తుని సత్యన్నారాయణ మైదానంలో శుక్రవారం ప్రారంభమైన హ్యాండ్ బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. అక్టోబర్ ఒకటో తేదీ వరకూ 67వ రాష్ట్రస్థాయి అంతర జిల్లాల హ్యాండ్ బాల్, అండర్ 17 స్కూల్ గేమ్స్ బాల, బాలికల పోటీలు తెనాలిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్తమ క్రీడానైపుణ్యాని ప్రదర్శించి దేశం గర్వించే క్రీడాకరులుగా రాణించాలని ఆకాంక్షించారు.

ఆర్‌విఆర్‌లో గుండె సమస్యలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు : ఆధునిక జీవనశైలి, ఒత్తిడి కారణంగా అధికశాతం మంది గుండె సంబంధిత సమస్యలకు లోనవుతున్నారని, వాటిని అదిగమించేందుకు క్రమబద్ధమైన ఆహారం, వ్యాయామం అవసరమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ప్రపంచ హృదయ దినోత్సవం నిర్వహించారు. ప్రాథమిక వైద్య చికిత్స కేంద్ర నిపుణులు డాక్టర్ ఎం.బద్రీనారాయణ గుండె సంబంధిత సమస్యలు రావటానికి కారణాలను, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక, విద్యార్థులు కలిసి ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేస్తూ ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వరల్డ్ హార్ట్‌డే అంతిమ లక్ష్యం హృదయ సంబంధ వ్యాధుల్ని తొలగించటం అని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఒత్తిడిని అదుపులో ఉంచుకుంటూ, వ్యాయామం, సైక్లింగ్, మంచి ఆహారం తీసుకోవటం వల్ల గుండె సమస్యలు నివారించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎం.సుధాకర్, డాక్టర్ జి.రామ్మోహన్‌బాబు, డాక్టర్ వి.రామ్‌కోటేశ్వరరావు, డాక్టర్ ఎస్.రాధిక పాల్గొన్నారు.